క్లుప్తంగా

జాతరకు ఏర్పాట్లు చేయాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నేతలు

శాంతిపురం: కొలమడుగు పంచాయతీలోని కదిరిఓబనపల్లిలో జరిగే కురబ కులస్తుల జాతరకు ప్రభుత్వ పరంగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఆలయ ధర్మకర్త మునిరత్నంగౌడు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఎంపీడీఓ కుమార్‌ను కార్యాలయంలో కలిసి ఏర్పాట్లు చేయాలని కోరారు. మార్చిలో జరిగే ఈ సిద్ధేశ్వర స్వామి జాతరకు అవసరమైన రోడ్లు, విద్యుత్, వైద్యం, పారిశుధ్య ఏర్పాట్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, నేతలు రామకృష్ణప్ప, శ్రీరాములు, మంజునాథ్, సిద్ధప్ప, జయప్ప పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని గుమ్మిరెడ్డిపల్లికి చెందిన రాధాకృష్ణారెడ్డి మృతిచెందాడు. విషయం తెలిసి జెడ్పీ చైర్మన్ బుధవారం గ్రామానికి చేరుకుని రాధాకృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్రీడాకారులకు అభినందనలు



ట్రోఫీ అందజేసి క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం

చౌడేపల్లె: విశాఖపట్టణం జిల్లా చోడవరం మండలంలోని అంకురపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన జి.రూప, టి.సుమతిని హెచ్‌ఎం నాగరాజరెడ్డి అభినందించారు. బుధవారం వీరిద్దరిని సత్కరించారు. జిల్లా జట్టుకు ఎంపికై పోటీల్లో ప్రతిభ చూపారన్నారు. పీడీ రాజేంద్ర, ఉపాధ్యాయులు మురళి, ఈశ్వర్, సుధాకర్, పరిమళ, రామకృష్ణ, ఆనంద్, సుబ్రమణ్యం, శివప్రసాద్ పాల్గొన్నారు.

సీడ్ ప్రోగ్రాంపై అవగాహన శిబిరాలు



సీడ్ సర్వేపై అవగాహన కల్పిస్తున్న నేతలు

పలమనేరు: నియోజకవర్గంలో సంచార జాతులపై సాగుతున్న సీడ్ సర్వేలో అధికారులకు సహకరించి కులాల వివరాలను ఇవ్వాలని ఎంబీసీ కులాల సంఘ నేతలు అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఆమేరకు బుధవారం నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డి, ధర్మపురి గ్రామాల్లో సంచార జాతుల వారితో అవగాహన శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీసీ నేతలు మాట్లాడుతూ బీసీ-ఏలోని 32 సంచార జాతి కులాలు సర్వే అధికారులూ ఇళ్ల వద్ద కొచ్చినప్పుడు వివరాలను అందించాలని సూచించారు. దీని ద్వారా సంచార జాతుల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందే పలు రకాల సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఎంబీసీ(మోస్ట్ బ్యాక్‌వర్డ్ కులాలు) నేతలు కోట్రేపల్లి మహేష్, ఈశ్వర, నాగరాజ, గోవిందు, వెంకటరమణ, నాగరాజా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలకు విశేష స్పందన



లింగాపురంలో పశు వైద్యశిబిరం

పెద్దపంజాణి: మండలంలోని పెద్దపంజాణి, లింగాపురం పంచాయతీలలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాలకు విశేష స్పందన వచ్చినట్లు శంకర్రాయలపేట పశువైద్యాధికారి సరిత తెలిపారు. ఇందులో భాగంగా పశువులకు నట్టల నివారణ, పిడుదల మందులు పిచికారీ చేసినట్లు పేర్కొన్నారు. చూలు, ఎదకురాని పశువులను పరీక్షించి వాటికి కావాల్సిన మందులు ఇస్తామన్నారు. శిబిరాల్లో 450 పశువులకు బూటాక్స్, 150 పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు ఆమె తెలియజేశారు. పశువైద్యాధికారి వినితకుమారి, సర్పంచ్ అఖిల, చలపతి పాల్గొన్నారు.

ఆశల పల్లకి

- నామినేటెడ్ పదవులకు పోటాపోటీ
- డీసీసీబీ చైర్మన్‌కు భారీగా డిమాండ్
- పది ఏఎంసీ చైర్మన్‌లకు నువ్వా.. నేనా
- పీఏసీఎస్‌లకు ఇప్పటికే జాబితా
- కూటమిలో రగులుతున్న చిచ్చు



పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈనెలాఖరు లేదా వచ్చే నెలలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు కూటమి నేతలు చెప్పుకుంటున్నారు. వీటిలో ఎక్కువ మంది చూపు డీసీసీబీ చైర్మన్ పోస్టుపైనే ఉన్నట్టు సమాచారం. జిల్లాలోని నామినేటెడ్ పదవుల్లో అత్యంత కీలకమైన ఈ పోస్టుపై కూటమి నేతల్లో భారీగా పోటీ ఉన్నట్టు తెలిసింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఎలాగైనా తమ వారికి డీసీసీబీ చైర్మన్ పోస్టు దక్కేలా అధిష్టానం వద్ద ఇప్పటికే పావులు కదుపుతున్నట్టు సమాచారం.

డీసీసీబీ చైర్మన్‌పై అందరి గురి..

గత ప్రభుత్వంలో డీసీసీబీ చైర్‌పర్సన్‌గా బైరెడ్డిపల్లికి చెందిన మొగసాల రెడ్డెమ్మ వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆమె రాజీనామా చేశారు. అప్పటి నుంచి డీసీసీబీ పాలన సీఈఓ ద్వారా సాగుతోంది. ఈ పోస్టు కోసం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని కూటమి నేతల నుంచి భారీగా పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో కుప్పానికి సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్నందున అక్కడి వారికి అవకాశం లేదనేమాట వినిపిస్తోంది. ఇక పలమనేరు నుంచి ఓ కీలక నేతకు ఇప్పించేలా ఇక్కడి ఎమ్మెల్యే మనసులో ఉందనే మాట తెలిసింది. పుంగనూరులో అవకాశం కల్పిస్తే బాగుంటుందనే ఓ లెక్క కూడా వారిలో ఉంది. ఇలా ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేల ద్వారా ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగుతున్న నేపథ్యంలో చిత్తూరుకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడికి ఇప్పటికే డీసీసీబీ చైర్మన్ పోస్టు ఖరారైనట్టు తెలిసింది.

భారీగా ఆశావహులు..

జిల్లాలోని చిత్తూరు, పుంగనూరు ఏఎంసీ చైర్మన్లు (బీసీ- జనరల్), కుప్పం, పలమనేరు (బీసీ-మహిళ), సోమల(ఎస్సీ-మహిళ),ఎస్‌ఆర్ పురం (ఎస్సీ-జనరల్), నగిరి, రొంపిచెర్ల (జనరల్ మహిళ), పెనుమూరు, బంగారుపాళెం(ఓసీ జనరల్)గా ఇటీవల ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఆమేరకు ఇప్పటికే ఈ పోస్టులను ఎవరికివ్వాలో ఆయా ఎమ్మెల్యేలు పేర్లను ఖరారు చేసినట్టు తెలిసింది. కానీ ఈ పోస్టులకు జనసేన, బీజేపీ నేతలు సైతం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

పీఏసీఎస్‌లకు అంతా సిద్ధం...

మరోవైపు ప్రాథమిక వ్యవసాయ సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లకు ఆయా ఎమ్మెల్యేల నుంచి ఇప్పటికే పేర్లు పంపినట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఖరారు చేసుకున్న నేతలు త్వరలో జరిగే ప్రమాణ స్వీకారాలకు సైతం సన్నాహాలు చేసుకుంటున్నారు. ప్రెసిడెంట్ పోస్టులను టీడీపీ వారికిస్తూ డైరెక్టర్ పోస్టులను కూటమిలోని రెండు పార్టీలకివ్వనున్నట్టు సమాచారం. ఇక ఆలయాల పాలక మండలి కమిటీల వ్యవహారాలు సైతం ఓ కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. మొత్తం మీద కూటమిలోని నేతలకు మనస్పర్థలు రాకుండా ఈ తతంగాన్ని పూర్తి చేయాలనే అధిష్టానం ఆదేశాలతో ఆయా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు నామినేటెడ్ పదవులు జాబితాను ఇప్పటికే పంపినట్టు అధికార పార్టీ నేతలే చెప్పుకుంటున్నారు. ఈ పదవుల పందేరం జరిగాక తమకు అన్యాయం జరిగిందని కూటమి నేతల్లో అసంతృప్తి భగ్గు మనడం ఖాయంగా కనిపిస్తోంది.

సమస్యల పరిష్కారానికి కృషి

పుంగనూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు జగన్నాథయాదవ్ బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిపోలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సమస్యలను జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు బలరాం, రాధాకృష్ణ, జీఆర్‌ఎన్.రెడ్డి, రమణ పాల్గొన్నారు.

పెద్దపురంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మావతి

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని పెద్దపురంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఫ్యామిలీ వైద్యాధికారి పద్మావతి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు శ్రేయస్కరమన్నారు.

ఠాగూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



విగ్రహావిష్కరణ చేస్తున్న చక్రపాణి

పుంగనూరు: విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దిట్టకవి చక్రపాణి కోరారు. బుధవారం మండలంలోని అడవినాథునికుంట మోడల్ స్కూల్‌లో విశ్వకవి ఠాగూర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లేందుకు ఇష్టపడని ఠాగూర్ ఇంటి వద్దే విద్యను అభ్యసించి అన్ని రంగాల్లోనూ రాణించి, ఆంగ్లంపై పట్టు సాధించారన్నారు. ఆనాటి నుంచి ఎన్నో రచనలు చేసి నోబుల్ బహుమతిని పొందారని తెలిపారు. అలాంటి మహనీయుడి జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని రాణించాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ రమా, రిటైర్డ్ అధ్యాపకులు వెంకటరెడ్డి, ప్రజాసైన్సు వేదిక ప్రతినిధులు సురేష్, పరివర్తన ప్రసాద్, స్పందన, రామచంద్ర, వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించుకోవాలి



ఏడీ శివకుమార్

పుంగనూరు: రైతులు నానో యూరియాను వినియోగించుకోవాలని ఏడీ శివకుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నానో యూరియా పంటలకు, పర్యావరణానికి అనుకూలమైందని తెలిపారు. లిక్విడ్ నానో యూరియాను పిచికారీ విధానంలో వినియోగించుకోవచ్చునని తెలిపారు. తృణధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, పత్తి వాటికి నానో యూరియా రెండు సార్లు వినియోగించుకోవచ్చునన్నారు. నానో యూరియా తయారు చేసిన రెండు సంవత్సరాలలోపు వినియోగించుకోవాలని, తరువాత వినియోగించరాదన్నారు. ఏవైన సందేహాలు ఉంటే వ్యవసాయ కార్యాలయంలో సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.

ఆయుష్మాన్ కార్డులను పొందండి



కార్డుల కోసం నమోదు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డులను అర్హులైన వారందరూ పొందాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని కుటుంబాలు ఆధార్ కార్డును తీసుకెళ్లి ఎంఎల్‌హెచ్‌పీ లేదా ఏఎన్‌ఎంలకు ఇవ్వాలన్నారు. కార్డు పొందిన వారికి రూ.5 లక్షల వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వైద్యసేవలను ఉచితంగా పొందవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సునీత, రుక్మిణి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే!

కుప్పం: కుప్పం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ 27 అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆపార్టీ అధిష్టానం ప్రకటించింది. వీరిలో నియోజకవర్గ యువత విభాగానికి అధ్యక్షుడిగా కె.హేమంత్ కుమార్, మహిళా విభాగానికి ఆదిలక్ష్మి, రైతు విభాగానికి ఎస్.నాగభూషణం, బీసీ సెల్‌కు పీవీ కృష్ణ, ఎస్సీ సెల్‌కు వి.చెంగప్ప, ఎస్టీ సెల్‌కు బి.సుందర్ నాయక్, మైనార్టీ సెల్‌కు బర్కత్ ఉల్లా, క్రిస్టియన్ సెల్‌కు కె.శంకరప్ప, విద్యార్థి విభాగానికి ఎస్.వి. సురేష్, పంచాయతీ రాజ్ విభాగానికి ఎం. నాగభూషణం, మున్సిపల్ అధ్యక్షుడిగా ఆర్.మునిరాజ్, ఆర్‌టీఐ విభాగానికి ఎ.నగేష్, వలంటీర్ల విభాగానికి టి.సంపత్, గ్రీవెన్స్ సెల్ విభాగానికి టి.మునెప్ప, వాణిజ్య విభాగానికి వి.సంతోష్ కుమార్, అంగన్‌వాడీ విభాగానికి కేఆర్.ఉమ, న్యాయ విభాగానికి శ్రీకాంత్ సురేష్, సాంస్కృతిక విభాగానికి చిన్నప్పయ్య, ఐటీ విభాగానికి పి.రజనీకాంత్, సోషల్ మిడియా విభాగానికి ఎ.జగన్, దివ్యాంగుల విభాగానికి టీవీ కృష్ణమూర్తి, వైద్యుల విభాగానికి జీహెచ్.విజయరామ్మోహన్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు రంగయ్య, మేధావుల విభాగానికి ఎం. వెంకటపతి, బూత్ కమిటీ విభాగానికి ఎస్. విజయకుమార్, ప్రచార విభాగానికి జీవీ రమేష్‌ను నియమిస్తూ ప్రకటన విడుదల చేసింది.

పుంగనూరు నియోజకవర్గం..

పుంగనూరు: వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామక ఉత్తర్వులను బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. యూత్ విభాగం అధ్యక్షుడిగా టి.కిరణ్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా జి.అనుప్రియ, రైతు విభాగం సీఎం. తిమ్మారెడ్డి, బీసీ సెల్ చీకటిపల్లె లక్ష్మీపతిరెడ్డి, ఎస్సీసెల్ డి. రెడ్డెప్ప, ఎస్టీ సెల్ ఎస్. వెంకటరెడ్డి, మైనార్టీ సెల్ ఎస్‌కేఈ సనావుల్లా, క్రిస్టియన్ సెల్ పి.లాజర్, స్టూడెంట్ విభాగం జి. పూజిత్‌రెడ్డి, పంచాయతీరాజ్ పి.శ్రీరాములు నియమితులయ్యారు. అలాగే ఆర్టీఐ విభాగం బి. బాలాజి, వలంటీర్స్ విభాగం జి.మోహన్‌యాదవ్, గ్రీవెన్స్‌సెల్ సూరేషా, వాణిజ్య విభాగం వెంకటేష్, వీవర్స్ వింగ్ (చేనేత మగ్గాల విభాగం) అధ్యక్షుడిగా ఎస్. రవీంద్ర, వైఎస్సార్ టీయూసీ ఎస్. సయ్యద్‌బాషా, అంగన్‌వాడీ విభాగం సి. యశోదమ్మ, లీగల్ సెల్ ఎన్. సుధాకర్‌రెడ్డి, కల్చరల్ విభాగం దుర్గం అగస్తి, సోషల్ మీడియా విభాగం ఎం.రెడ్డిరాజా, ఐటీ విభాగం ఎస్. బాబూరావ్, దివ్యాంగుల విభాగం కె. శ్రీనివాసులు, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా వి. శరవణ్‌కుమార్, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా జి. శ్రీనివాసులును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

వీఆర్‌ఓపై చర్యలు తీసుకోండి

బైరెడ్డిపల్లె: మండలంలోని బేలుపల్లెలో అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం ఎంపిక చేసిన 5 సెంట్ల స్థలాన్ని వీఆర్‌ఓ వెంకటేష్ రికార్డులు తారుమారు చేసి రిజిస్ట్రేషన్ చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతల అండదండలతో తాను ఏమి చేసినా జరుగుతుందని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నారు. అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వ స్థలాలను బంధువులకు, కూటమి నేతలకు కట్టబెడుతున్న వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వెంటనే విచారణ జరిపించాలని కోరుతున్నారు.

ఘనంగా నల్లగంగమ్మ కుంభాభిషేకం





ప్రత్యేక అలంకరణతో అమ్మవారు, కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కుప్పం: పట్టణంలోని మునుస్వామిపురంలో నూతనంగా నిర్మించిన ప్రసన్న నల్లగంగమ్మ దేవస్థాన కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన చేసి 108 కలశాలతో మునుస్వామిపురం పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం సంప్రదాయబద్ధంగా కలశ ప్రతిష్టాపన చేశారు. అమ్మవారి ప్రతిష్టాపన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుంభాభిషేకం సందర్భంగా కడా పీడీ వికాస్ మర్మత్ అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు ప్రసాదాలు అందజేశారు.

కాణిపాకం తరహాలో మొగిలి అభివృద్ధి

- మొగిలీశ్వరుని సన్నిధిలో కలెక్టర్

బంగారుపాళెం: కాణిపాకం వినాయక స్వామి ఆలయం తరహాలో మండలంలోని మొగిలి శివాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారిని బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ దర్శించుకున్నారు. కలెక్టర్‌కు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారి దర్శనం కల్పించారు. కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

నా రోడ్లు.. నా ఇష్టం

- ప్రజాధనం దుర్వినియోగం
- పచ్చ నేతలకు వరం



కంచిబందార్లపల్లెలో టీడీపీ నేత ఇంటికి వేసిన సిమెంట్ రోడ్డు



వేపమానుకొత్తూరులో ఒక ఇంటికే సిమెంట్ రోడ్డు

కుప్పం: నియోజకవర్గంలో ప్రజాధనం అధికార పార్టీ నేతలకు వరంగా మారింది. ప్రధానంగా మహా కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సిమెంటు రోడ్లు ఇష్టానుసారంగా వేశారు. ఇందులో అధికంగా అధికార పార్టీ నేతల అభీష్టం మేరకు ఎక్కడపడితే అక్కడ అవసరం లేని చోట, సొంత ఇళ్లకు వేసుకున్నారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ నేతలు ఒక్కొక్కరి ఇంటికి రూ.10 లక్షలకు పైగా ఖర్చు పెట్టి సిమెంట్ రోడ్లు వేసుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. గుడుపల్లి మండలం కంచిబందార్లపల్లిలో 50 మీటర్ల మేర ఓ సిమెంట్ రోడ్డును వేశారు. చుట్టుపక్కల నివాస గృహాలుగానీ ఏమీ లేకపోయినా ప్రధాన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు ఇష్టం మేరకు బహిరంగ ప్రదేశంలో రోడ్డు వేసేశారు. దీనివల్ల ప్రజలకు ఉపయోగం లేదుగానీ.. ఒక్క టీడీపీ నాయకుడికి మాత్రం తమ బంధువుల ఇళ్లకు సౌకర్యంగా రోడ్డు వేసుకున్నారని ఆరోపణలున్నాయి. అదేవిధంగా గుడుపల్లి మండలం వేపమానుకొత్తూరులో టీడీపీ నాయకుల ఇళ్లకే సిమెంట్ రోడ్డు పరిమితమైంది.

సాయుధ శిక్షణ



శిక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది

చిత్తూరు అర్బన్: గురి చూసి కాల్చితే...బుల్లెట్ పాయింట్‌లోనే పడాలని అడిషినల్ ఎస్పీ శివానంద కిషోర్ అన్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని ఫైరింగ్ రేంజ్ ప్రాంగణంలో బుధవారం సివిల్, సాయుధ దళ పోలీసులకు ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. ఇందులో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలు, ప్రభుత్వ, ధన, ప్రాణ రక్షణకు ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. అనంతరం ఫైరింగ్‌పై పలు సూచనలు చేశారు. డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

లంపి స్కిన్ మహమ్మారి

- ఇప్పటికే మృతి చెందిన 80 పశువులు
- వేలల్లో నష్టపోతున్న రైతులు
- వైద్యం అందాలంటే కర్ణాటక నకిలీ వైద్యులే దిక్కు
- అలంకారప్రాయంగా వెటర్నరీ అసిస్టెంట్లు



లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువు



గుడుపల్లెలో పశువులు

గుడుపల్లె: గుడుపల్లె మండలంలో పాడి పశువులకు లంపి స్కిన్ వ్యాధి సోకి ప్రాణాలు కోల్పోతున్నాయి. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన రైతుల కళ్ల ముందే పశువులు మృత్యువాత పడుతుంటే తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే మండల పరిధిలో 80 పశువుల వరకు మృత్యువాత పడ్డాయి. అయినా పశువైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. మందులు కావాలంటే కర్ణాటకలోని నకిలీ పశువైద్యులు (గోపాలమిత్ర)లను ఆశ్రయించాల్సి వస్తోంది.

పశువుల ప్రాణాలు హరిస్తున్న లంపి స్కిన్ మహమ్మారి...

గుడుపల్లె మండలం కరువు ప్రాంతం కావడంతో ఉన్న అరకొర నీటితో రైతులు పాడి పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. లంపి స్కిన్ మహమ్మారి కారణంగా రైతులు ఆ జీవనం కూడా కోల్పోవాల్సి వస్తోంది. గత నాలుగు నెలలుగా మండల పరిధిలో లంపి స్కిన్ విస్తృతంగా వ్యాపించడంతో పాడి పశువులు వ్యాధి బారినపడుతున్నాయి. మండల పరిధిలో 16, 043 పశువులు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే వ్యాధి బారిన పడి 80 పశువులు మృత్యువాతపడ్డాయి. ఒక్కో పశువు రూ.80 వేల నుంచి లక్ష పెట్టి కొనుగోలు చేసి ఇక తిండికి కరువు ఉండదనుకుంటున్న తరుణంలో పాడి రైతుల పాలిట లంపి స్కిన్ మహమ్మారి దండయాత్ర చేస్తోంది. ఆశగా తెచ్చుకున్న పశువులు మృత్యువాత పడుతుండడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

చోద్యం చూస్తున్న పశు వైద్యాధికారులు...

లంపి స్కిన్ వ్యాధి సాధారణంగా చలికాలంలో వ్యాపిస్తుంది. ఇది వరకు వ్యాధి వ్యాపించకుండా ముందస్తు వ్యాక్సిన్లు వేసేవారు. ప్రస్తుతం వ్యాక్సిన్లు వేయక పోవడంతో వ్యాధి తీవ్రరూపం దాల్చింది. ఇప్పటికైనా పశువైద్యులు దీనిపై దృష్టిసారించాల్సి ఉండగా, కనీసం రైతులను పరామర్శించడం లేదు. గ్రామగ్రామాన సచివాలయంలో ఓ వెటర్నరీ అసిస్టెంట్ ఉన్నా, రైతుల గోడుపట్టడం లేదు. మండల వైద్యులు అయితే ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియడం లేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక రైతులు పక్కన ఉన్న కర్ణాటక నకిలీ పశువైద్యులను ఆశ్రయించి చేతులు కాల్చుకుంటున్నారు. వారికి వేలకు వేలు చెల్లించి నష్టపోతున్నారు.

ప్రభుత్వం స్పందించాల్సి ఉంది..

వేలాది రూపాయల విలువ చేసే పశువులు కళ్ల ముందే మృత్యువాతపడుతున్నా పశువైద్యులు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వ్యాధి మరింత ఉధృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పాడి రైతులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై గుడుపల్లె పశువైద్యాధికారి ఆమనిని వివరణ కోరగా, లంపి స్కిన్ వ్యాధి వైరస్ ద్వారా వచ్చే వ్యాధి అని, దీనికి నివారణ తప్ప వైద్యం లేదు, వ్యాక్సిన్లు వేసినా కొంత వరకు అరికట్టవచ్చే తప్ప శాశ్వత పరిష్కారం లేదన్నారు.

రాజగోపురం పనులు ప్రారంభం రేపు

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో రాజగోపురం పనులు 31న ప్రారంభించనున్నట్లు ఆలయ ఈఓ కమలాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.

CHANGE OF NAME
I, POORNIMA G. (Old Name)
W/o Damodar Naidu.G
Residing at D.No.6-87/1, M.Kotur Village and Post, Palamaner Mandal, Chittoor District (A.P)
here inform we have to make following corrections in School Records as per Aadhar Card.
POORNIMA.M
(New Name)

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పలమనేరు, కుప్పం : 93981 01870
పుంగనూరు : 96524 21441